బీఆర్ఎస్ సభకు తరలిరావాలి

- పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు నాగేందర్‌గౌడ్
- రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ విడుదల

రజతోత్సవ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

నవాబుపేట, ఏప్రిల్ 18 : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు నాగేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. నవాబుపేటలోని ఓ ఫంక్షన్ హాలులో పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సాధించే క్రమంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి పేదలకు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని ఉద్యమ కాలం నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా నిర్వహించని విధంగా వరంగల్‌లో రజతోత్సవ సభను విజయవంతం చేయడానికి భారీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. సభకు సంబంధించిన ఏర్పాట్లను కార్యకర్తలకు వివరించారు. మండల పరిధిలోని కార్యకర్తలు సభకు హాజరై మళ్లీ క్షేమంగా ఇంటికి చేరుకోవాలని తెలిపారు. ఇందుకోసం బీఆర్ఎస్ గ్రామ కమిటీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదాం

అంతకు ముందు పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, ప్రధాన సలహాదారుడు మందుల విజయ్‌కుమార్, పురుషోత్తంచారి, శాంతికుమార్, పోలీస్ మహేశ్వర్‌రెడ్డి, ఆసిరెడ్డిగారి వెంకట్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు మాణిక్ రెడ్డి, జగన్‌రెడ్డి, మైనార్టీ మండల అధ్యక్షుడు ఫిర్థోస్‌ఖాన్, మహిళా మండల అధ్యక్షురాలు రాణిగౌడ్, పుష్పలత, అధికార ప్రతినిధి సుధాకర్, జామ చంద్రం, విద్యార్థి నేత అనీల్, ముకుంద్, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి : నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా ర్యాలీ

పరిగి, ఏప్రిల్ 18 : కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా శుక్రవారం పరిగిలో ముస్లింలు నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని బహార్‌పేట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరిపారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు పిలుపు మేరకు పరిగి మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఈ సవరణలు ముస్లిం వర్గాలనే కాకుండా ఇతర మైనారిటీ వర్గాలను ప్రభావితం చేస్తాయని జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మీర్ మహమూద్‌అలీ పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చిన ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌ను ముస్లింలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య, ఎల్ హెచ్‌పీఎస్ నాయకులు గోవిందర్‌నాయక్, మజీద్ కమిటీ సదర్ మోయిజ్, నాయకులు మీర్ తాహెర్‌అలీ, అయూబ్, బషీర్, పాష, సమీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ఆమనగల్లు : మండల కేంద్రంలో వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపి చట్టం చేయడాన్ని నిరసిస్తూ ఆమనగల్లులో శుక్రవారం ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. జామియా మజీద్ అధ్యక్షుడు మహ్మద్ మాసూమ్ ఆధ్వర్యంలో ముస్లింలు బ్యానర్లు, జాతీయ జెండాలు, ప్లకార్డులు, నల్ల జెండాలను పట్టుకొని శ్రీశైలం హైద్రాబాద్ జాతీయ రహదారి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తున్నదన్నారు. కార్యక్రమంలో గౌస్ మైనుద్దీన్, జానీ భాయ్, సయ్యద్, సయ్యద్ మీర్, నయీమ్, జాహంగీర్, జబ్బార్, మసూమ్, రజక్, అల్తాఫ్, ఎజాస్, ఖాధర్, హైమత్, జాంగిర్ అలీ, జావిద్, అప్జల్,అహ్మద్, అలీమ్, బాబా, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆమన్‌గల్లు: ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అంధకారంలో రెండు గ్రామాలు

- నిలిచిపోయిన విద్యుత్ సరఫరా
- ఇబ్బందుల్లో ఆత్కూర్, ఆత్కూర్ తండా వాసులు

పెద్దేముల్, ఏప్రిల్ 18 : మండల పరిధిలోని రెండు గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. ఇందూరు సబ్‌స్టేషన్ పరిధిలోని త్కూర్, ఆత్కూర్ తండాలకు రెండు రోజుల్లో 36 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఉరుములు, మెరుపులు, వర్షం లేకున్నా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఎందుకు ఏర్పడిందో ఆయా గ్రామాస్తులు అయోమయంలో ఉన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కరెంట్ సరఫరాలో ఎక్కువ సమయం అంతరాయం ఘటన రికార్డు నెలకొల్పింది. గాలివాన బీభత్సానికి ముందు ఒకరోజులో 10 గంటల పాటు కరెంట్ కట్ అయింది. గాలి వాన వచ్చిన 24 గంటల తర్వాత కూడా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అధికారులతో నిర్లక్ష్యమో ఏమో తెలియదు కాని మళ్లీ చీకటి రోజులు వచ్చాయని ఆయా గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించడం లేదు..

కరెంటు లేకపోవడంతో రెండు రోజుల నుంచి అంధకారంలో మగ్గిపోతున్నాం. పవర్ లేకపోవడంతో తాగేందుకు నీరు కూడా లేదు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదు. సెల్‌ఫోన్లలో చార్జింగ్ లేక తాండూరుకు వెళ్లి చార్జింగ్ పెట్టుకునే పరిస్థితి వచ్చింది. విద్యుత్ అధికారులు స్పందించి మా గ్రామానికి విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలి.

- సురేశ్, ఆత్కూర్ తండా, పెద్దేముల్

విద్యుత్ పునరుద్ధరణలో విఫలం

- 24 గంటల కరెంట్ కట్
- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్, ఏప్రిల్ 18 : తాండూరులో ఈదురుగాలులతోపాటు వర్షం కురువడంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగదారులు గురువారం సాయంత్రం 6 నుంచి ఉదయం 6గంటల వరకు జాగారం చేశారు. విద్యుత్ సమస్య తలెత్తిన చోట అధికారులు పునరుద్ధరించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి ఈదురు గాలులు వీచినా, వర్షం పడినా వెంటనే కరెంట్ కట్ చేయడం విద్యుత్ అధికారులకు పరిపాటిగా మారింది. మండల పరిధిలోని గౌతాపూర్, కోటబాసుపల్లి, కరణ్‌కోట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో పూర్తిగా కరెంట్ లేక చిమ్మచీకట్లో మగ్గాల్సి వచ్చింది. కరెంట్ పునరుద్ధరించకపోగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఏఈ, ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో పని చేసే లైన్‌మెన్లపైపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కొండాపూర్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మాదాపూర్‌లోని శిల్పారామంలో నృత్యకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. న్యూ జెర్సీ నుంచి విచ్చేసిన కూచిపూడి కళాకారిణి నీలిమ రాజు కృష్ణ పంచకం, నారాయణీయం, వీక్షేదా దేవ దేవం ప్రదర్శించి మెప్పించారు.

పలు ప్రాంతాల్లో నీటి అంతరాయం

సిటీబ్యూరో, ఏప్రిల్18, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు 3 ఫేజులకు విద్యుత్తు సరఫరా చేసే పెద్దాపూర్132 కేవీ వద్ద టీజీ ట్రాన్స్కో అధికారులు మరమ్మతులు, జలమండలి సిబ్బంది లీకేజీ పనులు చేపట్టారు. బంజారాహిల్స్, సోమాజిగూడ, జూబ్లీహిల్స్, తట్టిఖానా, ఎర్రగడ్డ, వెంగల్‌రావు నగర్, ఎస్.ఆర్.నగర్, ఫతేనగర్, ఎల్లారెడ్డిగూడ, ఎస్‌పీఆర్ హిల్స్, బోరబండ, కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీ నగర్, కూకట్‌పల్లి, బాలానగర్, మూసాపేట, భారత్ నగర్, మోతీనగర్, గాయత్రీ నగర్, కొండాపూర్, డోయెన్స్ కాలనీ, మయూరినగర్, హఫీజ్‌పేట్, షేక్ పేట్, భోజగుట్ట రిజర్వాయర్, మణికొండ, నార్సింగి, మంచిరేవుల ప్రాంతాల్లో నీటి అంతరాయం ఏర్పడనున్నట్లు జలమండలి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

జాతీయ భద్రతకు ఇక్ఫాయ్

- బిట్స్ పిలానీ మధ్య ఒప్పందం

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇక్ఫాయ్, బిట్స్ పిలానీ ప్రతినిధులు

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 18 : జాతీయ భద్రతలో పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్య అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పిలానీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. బిట్స్ హైదరాబాద్ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ ఒప్పందంపై బిట్స్ పిలానీ గ్రూప్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.రామ్ గోపాల్ రావు, ఇక్ఫాయ్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్ఎస్ గణేశ్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన డీఆర్‌డీవో మాజీ చైర్‌పర్సన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి ఈ భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. సందర్భంగా ఇక్ఫాయ్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్ఎస్ గణేశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల పరిశోధన, స్టార్టప్ కార్యకలాపాలకు ఇక్ఫాయ్ పూర్తి మద్దతు అందిస్తుందని, త్వరలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రొఫెసర్ వి.రామ్ గోపాల్ రావు మాట్లాడుతూ.. స్టార్టప్‌లకు సీడ్ మనీ గ్రాంట్ అందించడం ద్వారా విద్యార్థులను వ్యవస్థాపకులుగా మార్చేందుకు బిట్స్ పిలానీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ, బిట్స్ పిలానీ సీహెచ్ఈఎన్ ఎస్ అధిపతి ప్రొఫెసర్ రామ మనోహర్ బాబు, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ అమృత ప్రియదర్శిని, పరిశోధన, ఆవిష్కరణ డీన్ ప్రొఫెసర్ సంకత్ గోయెల్, ఇక్ఫాయ్ రిజిస్ట్రార్ ఎస్.విజయలక్ష్మి, ఇక్ఫాయ్ టెక్ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎల్ నారాయణ, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీఎస్ శైలజన్, ఐఐఈసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.సాయినాథ్ పాల్గొన్నారు.

శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం

సిటీబ్యూరో, ఏప్రిల్18(నమస్తే తెలంగాణ): నిరుద్యోగ ఐటీ పట్టభద్రుల కోసం వినూత్న రీతిలో ఉచిత శిక్షణ ఇస్తూ వారికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఉద్యోగ ప్రమోద కృషి చేస్తుందని శ్రీనాథ ఆచారి తెలిపారు. శ్రీమాన్ మధ్వాచార్య మూల మహా సంస్థాన్ ఉత్తరాది మఠాధిపతి శ్రీసత్యాత్మ తీర్థ స్వామీజీ ఆదేశాలతో చేపట్టిన ఉద్యోగ ప్రమోద మొదటి బ్యాచ్ పూర్తయిన సందర్భంగా కాచిగూడలో హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదువుకునే విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ పెంపొందిస్తూ ఉద్యోగాలు కల్పించేలా మార్గదర్శిగా ఈ ఉద్యోగ ప్రమోద ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 17 మందికి ఉద్యోగాలు పొందారని, ప్రస్తుతం 200 మంది నమోదు చేసుకున్నట్లు వివరించారు. అనంతరం రాఘవేంద్ర ఆచారి రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, ఐటి రంగాలలో నిష్ణాతులైన ప్రముఖులచే ఆన్లైన్లో విద్యార్థులకు ఈ ఉద్యోగ ప్రమోద ద్వారా స్కిల్ డెవలప్మెంట్ ఐటీలో మెలుకువలు, ఇంటర్వ్యూ ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై శిక్షణ అందిస్తునామని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కంప్యూటర్ సైన్స్‌లో చెరుకు ప్రభాదేవికి డాక్టరేట్

ప్రభాదేవికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఓయూ ఇంజినీరింగ్ అధికారులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 18: ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుంచి ఐటీ విభాగంలో చెరుకు ప్రభాదేవికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ వీబీ నరసింహ పర్యవేక్షణలో 'ఐడెంటిటీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ఫ్రేమ్ వర్క్స్' అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ గెజిట్ ద్వారా ప్రభాదేవికి డాక్టరేట్ ప్రకటించారు. చిన్ననాటి నుంచే చదువులో చురుగ్గా ఉండే ప్రభాదేవి ఉన్నత ఆశయంతో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది తన లక్ష్యాన్ని పూర్తి చేశారు. సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం, తాటిపాముల గ్రామానికి చెందిన ప్రభాదేవిది వ్యవసాయ కుటుంబం. తండ్రి చెరుకు సోమయ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్. తల్లి కలమ్మ గృహిణి. ఓయూ నుంచి డాక్టరేట్ సాధించడం పట్ల అధ్యాపకులు భర్త దాసరి నారాయణ, సోదరుడు చెరుకు యాకస్వామి, మిత్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఓయూ ప్రొఫెసర్లు, కోస్కాలర్స్ ఘనంగా సన్మానించారు. ప్రభాదేవి మాట్లాడుతూ పీహెచ్‌డీ సాధించేందుకు సహకరించిన గైడ్ ప్రొఫెసర్ వీబీ నరసింహ, హెచ్ఓడీ పీవీ సుధ, ప్రొఫెసర్ శ్యామల, ప్రొఫెసర్ వెంకటదాస్, గురువులకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు దుక్కులే మేలు

- పంట దిగుబడికి ఎంతో ప్రయోజనం
- తేమను నింపుకొనే శక్తి పెరుగుతుంది..
- కలుపు నివారణకు దోహదం

మొయినాబాద్, ఏప్రిల్ 18 : వేసవిలో దుక్కులను దున్నితే పంటల దిగుబడికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. పొలాన్ని చదును కావడంతో పాటు గతేడాది పంట మొదళ్లు, ఇతర అవశేషాలు, చెత్తను ఏరి కాల్చే తదితర పనులు చేయాలి. జూన్‌లో తొలకరి వర్షాలు కురవగానే విత్తనాలు సమకూర్చుకోవాలి. రైతులు ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం సాగుకు సిద్ధమైతే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వివరాలు వాలి మాటల్లోనే.. పంట సాగుకు ముందుగా భూసార పరీక్షలు చేయించాలి. ఇందు కోసం మట్టి నమూనాలు సరైన పద్ధతిలో తీసుకోవాలి. ఈ పరీక్షలతో భూమిలో ఎంత సారం ఉంది, ఎలాంటి విత్తనాలు, ఎంత మోతాదులో ఎరువులు వేయాలి తదితర విషయాలపై అవగాహన వస్తుంది. ఇష్టారీత్యా ఎరువులు వినియోగిస్తే నష్టపోవాల్సి వస్తుంది. భూసార పరీక్షలతో పంటల సాగుతీరు మార్చుకోవాలి. యాసంగి పంటల కాలం పూర్తి కాగానే మెట్ట భూములన్నీ ఖాళీగా మారుతాయి. ముందస్తుగా వేసవిలో దుక్కులు దున్నుకోవడం మేలు. భూసార పెంపునకు పచ్చి రొట్టె పెంచడంత దితర చేస్తే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. పంటలను ఆశించే పురుగులు ఇప్పుడు నిద్రావస్థలో ఉంటాయి. దుక్కులు దున్నితే పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారమవుతాయి. లేదా ఎండకు చనిపోతాయి. శిలీంద బీజాలు కూడా భూమి తోపలి పొరల నుంచి బయటకు వస్తాయి. భూసార పరీక్షలతో సూక్ష్మ స్థూల పోషకాల లోపాలు మోతాదు పద్ధతిలో ఎరువులు వాడకంతో పాటు అదనపు ఖర్చులు తగ్గించుకునే వీలు ఉంది. నూతన ఆధునిక యాంత్రాల వినియోగం, సాంకేతిక పరిజ్ఞానం పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

ఖరీఫ్ సాగుకు ముందు నుంచే..

ఖరీఫ్ సాగుకు ముందు నుంచే చేలు చదును చేసుకుని నెల రోజుల ముందే వేసవి దుక్కులు దున్నుకోవాలి. తొలకరి వర్షాలకు ముందే పంట విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంట కోత తర్వాత భూమిని వదిలి వేయకుండా వేసవిలో దుక్కి దున్నుకుంటే చీడపీడలను కొంత వరకు నివారించవచ్చు. నేలను లోతుగా దున్నడంతో కొంత తేమలో ఉన్న కీటకాలు నశిస్తాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకోవడానికి భూమిని దున్నుకోవాలి. ఈ వర్షాలతో లోతుగా దున్నడంతో వరుస వరుసకు మధ్యలో వర్షం నీరు నిలుస్తాయి. మొదటి సారి దుక్కులు దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు వర్మీ కంపోస్టు, శాస్త్రవేత్తలు సూచించిన చెరువు మట్టిని పొలంలో వేసుకుంటే పంట దిగబడి సామర్థ్యం పెరుగుతుంది. సేంద్రియ ఎరువులు అందించడం ద్వారా సూక్ష్మ పోషక లోపాలను నివారించవచ్చు. లోతు తక్కువగా ఎర్ర చెలుక ఎర్రచెల్క నేలల్లోను లోతు తక్కువ, అడుగున గట్టిగా ఉన్న నేలల్లోనూ లోతుగా దుక్కి చేయడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. నేలను 35 సెం.మీ నుంచి 40 సెం.మీ వరకు లోతుగా దున్నుకుంటే భూమిలో గట్టిపొర పగిలి నేల బాగా గుల్ల బారుతుంది. వర్షం నీళ్లు భూమిలోకి ఇంకుతుంది. లోతు దుక్కి ప్రభావం 2 నుంచి 3 ఏండ్ల వరకు ఉంటుంది.

నేలను కలియదున్నితే మేలు

పత్తి పంట దిగుబడి అనంతరం పత్తి చెట్లను మొదలు కోసి కుప్పగా చేసి కాల్చేస్తుంటారు. కొంత వంట చెరుకుగా వినియోగిస్తున్నారు. అలా కాకుండా పత్తి మొదళ్లను వృథా పోకుండా రోటవేటర సహాయంతో భూమిలో తేమ ఉన్నప్పుడు భూమిలో కలియదున్నాలి. రోటవేటర్ తర్వాత మల్చ్ చెల్డ్ నాగలితో దున్నాలి. తర్వాత మరోసారి రోటవేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేస్తే భూమి సారవంతమై పత్తి పంటకు బయట నుంచి అందాల్సిన ఎరువులు తగ్గుతాయి.

చీడపీడలు ఆశించవు

వేసవిలో దుక్కులు దున్నుకోవడంతో పంటకు చాలా మేలు చేస్తుంది. వేసవిలోనే దుక్కలు దున్నుకొని పెట్టుకుంటే చీడ పీడలు పంటకు ఆశించకుండా ఉంటాయి. వేసవిలో నేల దున్నడంతో నేల లోపలి భాగంలో పంటను ఆశించే పురుగులు నేల పైకి వస్తాయి. అప్పుడు పక్షులకు ఆహారంగా మారడం, ఎండల తీవ్రతకు నశించిపోతాయి. కలుపు నివారణకు దోహదపడుతాయి. పంటకు ముందే భూసార పరీక్షలు చేయించుకుంటే పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలి. భూసారం మేరకు ఆ నేలలో ఎలాంటి విత్తనాలు వేయాలనే అంచనా రైతులకు వస్తుంది. ముందస్తు దుక్కులు దున్నడంతో ఖర్చు తగ్గుతుంది.

- అనురాధ, ఏవో, మొయినాబాద్

మానవ రహిత వ్యవసాయ దిశగా పరిశోధనలు సాగాలి

- సహజ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్లు, రోబోటిక్ టెక్నాలజీ వినియోగాలపై ప్రత్యే క దృష్టి పెట్టాలని, ఆ దిశగా పరిశోధనలు సాగాలని సూచించారు.
- ప్రకృతి పరిరక్షణకు అనువైన విధానాలను తీసుకురావాలన్నారు. దేశవాళి వంగడాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.
- జూన్ 2న రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇద్దరు, ముగ్గురు రైతులకి విశ్వవిద్యాలయం తరపున నాణ్యమైన విత్తనాలు అందించనున్నామన్నారు.
- 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం రానున్నదన్నారు.
- రాష్ట్రంలోని అధిక ఆహార ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. ఈ అంశంలో విశ్వవిద్యాలయం నాలెడ్జ్ భాగస్వామిగా ఉండనుందన్నారు.
- రాష్ట్రం నుంచి ప్రతి ఏటా సుమారు రూ. 20 వేల కోట్లవిలువ గల బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉందని.. అందుకు అవసరమైన వనరులు లేవన్నారు.

వ్యవసాయ యూనివర్సిటీ ,(హైదరాబాద్) ఏప్రిల్ 18:పర్యావరణ పరిరక్షణ, మానవ రహిత దిశగా వ్యవసాయ పరిశోధనలు సాగాలని, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి 48వ సమావేశం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం సెమినార్ హాల్ లో జరిగింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. విశ్వవిద్యాలయ బోధన సిబ్బంది, శాస్త్రవేత్తలు, రైతులు, ఉద్యాన, పశుసంవర్ధక విశ్వవిద్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

- మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్థలు, వ్యవస్థలు మారాలని జానయ్య అన్నారు. అధునాతన సవాళ్లని ఎదుర్కొనేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఎప్పటికప్పుడు పునర్‌వ్యవస్థీకరణ చర్యలు చేపడుతుందన్నారు.
- నీటిపారుదల ప్రాజెక్టులు నిర్మించి ఎరువుల ఫ్యాక్టరీలు విరివిగా స్థాపించామన్నారు. దీంతో అన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు.
- 1947-50 ల మధ్యకాలంలో దేశం సాధించిన దిగుబడులు, రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణ ఒకటే సాధిస్తుందన్నారు. మారిన వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి పెరుగుదల కారణంగా కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు.

హెచ్ఐసీసీలో కొలువుదీరిన హై లైఫ్ జువెల్స్

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ నటి పాయల్ రాజ్ పుత్

మాదాపూర్, ఏప్రిల్ 18: మహిళలకు ఎంతగానో నచ్చే బంగారు ఆభరణాలు మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హై లైఫ్ జ్యువెల్స్ పేరుతో శుక్రవారం హెచ్ఐసీసీలో కొలువుదీరాయి. ఇందులో తీరొక్క డిజైన్లతో కూడిన పలు రకాల బంగారు ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నటీమణులు పాయల్ రాజ్‌పుత్ విచ్చేసి నయని పావని, కుషిత కల్లపులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

రైతులకు అండగా పతంజలి

మౌగంజ్ జిల్లాలోని బంజరు, సాగు చేయని భూమిని రైతులకు ఉపయోగపడేలా పతంజలి సంస్థ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి రాజేంద్ర శుక్లా, సంబంధిత శాఖాధికారులు ఆ భూములను పతంజలి సంస్థకు అప్పగించినట్టు పతంజలి యోగాపీఠ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తెలిప